## పేరు మీరే పెట్టండి

**అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బాగుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.**

'లతా' లోపలికి అడుగు పెడుతూనే ఓ పెద్ద కేకపెట్టాడు మూర్తి.

ఆ సింహగర్జనకి ఎక్కడో వంటగదిలో పని చేసుకొంటున్న లత గుండెలదిరిపోయాయి వస్తూనే భర్త అంత కోపంగా ఉన్నాడేమిటా అని భయపడుతూ పనిచేసుకొంటు పైకి దోపుకొన్న చీరను గభాల్న క్రిందకు లాక్కుని ఒక్క అంగతో ముందు హాల్లోకొచ్చిపడింది.

"పని అయ్యిపోయిందా తొందరగా టాయ్‌లెట్ అవ్వు" అంటూనే గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకొని లుంగీ కట్టుకొని బాత్‌రూంలో దూరాడు మూర్తి.

ఆవేశం వచ్చినా పట్టలేం, ఆనందం కల్గినా పట్టలేం అనుకుంటూ అసలుసంగతేమిటో తెలియక అట్లాగే ఉండిపోయింది లత.

"ఏమిటి నువ్వింకా అలానే ఉన్నావు త్వరగా తయారవ్వు" హడావుడిపెట్టాడు. ఏ పిక్చర్ ప్రోగ్రామో పెట్టుకొచ్చారు ముందుగా చెపితే ఇంత కంగారు ఉండదు కదా అనుకొంటూ డ్రెస్ మార్చుకొచ్చేసరికి మూర్తి రెడీగా ఉన్నాడు. ఆమె తాళం తీసుకొని ఇంటికి వేసేంతలోనే అతను దారిన పోయే రిక్షా మాట్లాడేశాడు.

రిక్షా బందరు రోడ్డునుంచి పోతుంటే వెంకటేశ్వర థియేటర్‌కి కాబోలు రాత్రే అన్నారు అందులో ఏదో మంచి మూవీ ఆడుతోందని అనుకొంది. కానీ రిక్షా వెంకటేశ్వర థియేటర్ దాటి రేడియో స్టేషన్ దగ్గరకెళ్ళేటప్పటికి కోవెలసందులో ఉంటున్న చెల్లెలి గారింటికేమో దాని ఒంట్లో ఎలా ఉందో జ్వరంగా ఉందట తగ్గిందో, లేదో ఒకవేళ మరిదిగారుగాని రమ్మని ఫోన్ చేశారేమో... ఇలా సాగాయి ఆమె ఆలోచనలు.

అంతలోనే రిక్షా వెంకటేశ్వరస్వామి గుడిముందు ఆగింది. మూర్తి దిగటమే రిక్షావాడికి డబ్బులిచ్చి కొబ్బరకాయ, పూలు పట్టుకొచ్చి 'రా' అంటూ గుడిలోపలికి వెళుతున్న భర్తని అనుసరించింది ఆయోమయంగా.

'ఏమిటి ఇప్పుడు చెప్పండి' గుడిలోంచి బయటికి వచ్చిన తరువాత ప్రసాదం పెడుతున్న భర్తని అడిగింది లత.

"విగ్రహారాధన మీద వ్యతిరేకంగా పోయిన నెలలో నేను రాయలా ఆ కథ పత్రికలో పడింది రెమ్యూనరేషన్ కూడా పంపారు. నా కథ పత్రికలో పడితే వెంకటేశ్వరస్వామికి కొబ్బరకాయ కొడతానని మొక్కుకొన్నాను."

"అదా అసలు సంగతి" దిమ్మెరపోయింది లత.

—టి. సుహాసిని
ఇం. నెం. F/58
లబ్బిపేట,
విజయవాడ-10

స్రవంతి నెం: 25లో ఈశీర్షికలో ప్రచురించిన కథకి రచయిత శ్రీ బి.యల్. నారాయణ
పెట్టినపేరు: పాపంఅమాయకరావు

ఈవారం ఈ శీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ : శ్రీమతి మన్నెం శారద



కథలు రాసింది ఎవరా అని చూడకుండా కథల్ని నిష్పక్షపాతంగా చదివాను. వచ్చిన కథల్లో తొంభయి శాతం అమ్మాయి పెళ్ళికి ముందు తప్పు చేయడం వలనో, పెళ్ళయి వైధవ్యం ప్రాప్తించి గర్భవతి కావడం మరో వ్యక్తి ఆదర్శంగా ఆమెని చేపట్టి, ఆమె బిడ్డని మాత్రం మామగారికి అప్పజెప్పడాన్ని ఆధారం చేసి రాసినవి. నాకు నచ్చని మరో విషయం కడుపున పుట్టిన బిడ్డ కోసం ఎంతటి త్యాగాన్నయినా చేయగల స్త్రీ మూర్తి స్వార్థపరురాలయి బిడ్డని వదలి భర్తకి ప్రాధాన్యత ఇవ్వడం! ఆలోచనా విధానంలో నూతనత్వం వున్న రెండు కథలు నన్ను ఆకర్షించేయి. రచయితలు కొంత శైలిని కూడ సర్దుకోగలిగితే ఇంకా మంచి కథలు రాయగలరని నమ్ముతున్నాను. వారికి నా అభినందనలు.

శ్రీమతి మన్నెం శారద అనేక వార పత్రికలకి సీరియల్స్ రాసిన రచయిత్రి. కొన్నిటికి ప్రథమ, ద్వితీయ బహుమతులు కూడా గెలుచుకున్నారు. హైద్రాబాద్ చీఫ్ ఇంజనీర్స్ ఆఫీస్‌లో వుద్యోగం చేస్తూ రచనా వ్యాసాంగంలో చురుగ్గా పాల్గొంటున్నారు.

## "తల్లి మనసు"

రిక్షా దిగి లోనికి వస్తున్న ఆనంద్‌ను చూడగానే- "అమ్మాయ్! అల్లుడుగారొస్తున్నారు" అంటూ కేకేసాడు పరంధామయ్య. ఆ మాట వింటూనే ఆనందంగా వాకిట్లోకి పరుగెత్తుకు వచ్చింది జయలక్ష్మి. "కులాసానా బాబూ." అంటున్న మామగారి పలకరింపుకు ముక్తసరిగా బదులిచ్చి వరండాలోవున్న కుర్చీలో కూర్చున్నాడు ఆనంద్. భర్తను కళ్ళతోనే పలకరించి కాఫీ తీసుకురావటానికి లోనికెళ్ళింది జయలక్ష్మి.

"చెప్పండి! ఎందుకు నన్ను ఉన్నపళాన రమ్మని కబురంపారు?" మామగారిని చూస్తూ అడిగాడు ఆనంద్.

"చెప్పడానికేముంది ఆనంద్! అమ్మాయి పుట్టింటికి వచ్చి ఆర్నెల్లపైనే అయింది. ఎప్పుడెప్పుడు నువ్వు వచ్చి తీసికెళతావని ఎదురు చూస్తున్నాం కాని నీకు అలాంటి ఉద్దేశం వున్నట్లు కనిపించడంలేదు. ఇదేమన్నా బాగుందా! లోకం ఏమనుకుంటుంది! అమ్మాయి చేసిన తప్పేమిటి?" పరంధామయ్య గొంతులో ఆవేదన!

"ఇందులో తప్పొప్పుల ప్రసక్తిలేదు మామగారూ! గతంలో మీకు ఎన్నోసార్లు చెప్పాను. జయను భార్యగా ప్రేమించగలనుకాని, ఆమె బిడ్డకు తండ్రిగా నేను ఉండలేను. జయ కొడుకు బాధ్యత మీరు తీసుకుంటానంటే జయను తీసికెళ్ళడానికి నేనెప్పుడూ సిద్ధమే." మామగారితో చెప్పాడు ఆనంద్ తన నిర్ణయాన్ని.

"అన్నీ తెలిసి పెళ్ళిచేసుకుని ఇప్పుడిలా మాట్లాడటం బాగులేదు ఆనంద్! పెళ్ళయిన రెండేళ్ళకే భర్తను కోల్పోయి బిడ్డతో శోకదేవతలా మిగిలిపోయిన నా కూతురిని మళ్ళీ పెళ్ళి చేసుకుంటానని నువ్వు ఆనాడు ముందుకొచ్చినప్పుడు నిన్ను చూసి, నీ ఆదర్శభావాలను